పద్ధతి ఎన్నికల నుంచి తప్పుకోనటమే, కనుక అలా చేశాము.

ప్ర: మీ ఆశయ సాఫల్యం కొరకు మీరేమి చేయదలిచారు?

జ: భారతదేశంలో సంస్థానం "బి" తరగతి రాష్ట్రంగా చేరటానికి మేము "నూతన పద్ధతులను" అనుసరింపదలిచాం.

ప్ర: హింసాత్మక చర్యలు మీరు సాగిస్తారా?

జ: కాదు. మేము తీసుకొనే ప్రతి ఉద్యమమూ రాజ్యాంగబద్ధంగాను, అహింసాత్మకంగాను వుంటుంది.

ప్ర: మీరు పర్యటించిన ప్రాంతాల్లో మీకెలాంటి సానుభూతి వచ్చింది?

జ: జనసామాన్యం ఎల్లప్పుడూ సంపూర్ణమైన భారతదేశాన్నే కోరుతుంది. సాధారణంగా నాయకులే తరచు ప్రజల వాంఛలను తొక్కిపెడుతుంటారు. మా అభిప్రాయాలను అర్థంచేసుకొని సానుభూతి చూపించిన దక్షిణభారత ప్రజలకు పత్రికలకు మా ధన్యవాదాలు.

ప్ర: మీ అభిప్రాయాన్ని బలపరచటంకొరకు వివిధ పార్లమెంటు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పరుస్తారా?

జ: ఇది మంచిసలహా. దీన్ని అనుసరించటానికి ప్రయత్నిస్తాము.

శ్రీ పండిత ప్రేమనాథడోగ్రా చాలావృద్ధుడైనప్పటికీ, వారు ఓపికతో సమాధానాలిచ్చారు. తమ మనస్సులోని పొరపాటు అభిప్రాయాలు తొలగటానికి, భారతప్రజలు కొంతవ్యవధి తీసుకుంటారు. ఈ వ్యవధి ఎంత తక్కువైతే దేశక్షేమానికి అంతప్రయోజనం.

వేళ్లు పాతుకున్న సంప్రదాయాలు

# పొడసుత్తితో లోకం మరమ్మత్తు

పి. వి. పల్లి

రామారావుకి హఠాత్తుగా ఓ ఆలోచన బయలుదేరింది. తను పడుకున్నది మంచంమీదను. ఆ విషయం మరచిపోయాడు. కనీసం తను నిద్రావస్థలో ఉన్నట్లుకూడ తెలీదు. కళ్లు మూసుకుని వున్నట్టు అనుకోనేలేదు. ఆలోచన బయలుదేరగానే, దాని వెనకాశల పడ్డాడు. అయితే ఆలోచనకి ఆది ఏది? ఆధారమేది? దేనిగూర్చి—?

సాయంకాలం ఆరు గంటలకి పట్నంనుండి చేరుకున్నాడిల్లు. పట్నంలో ఆరోజంతా స్నేహితులతో తిరిగాడు. ఏవో విషయాలను గురించి మాట్లాడేను. వాళ్ళంతా దేనిగూర్చో చెప్పారు. అన్ని విషయాలూ విన్నాయి చెవులు. వాళ్ళ ముఖ కవళికలు, అంగ విన్యాసాలూ, కళ్ళతో చూశాడు. ఆ సాయంత్రం జరిగిన బహిరంగసభకి కూడా హాజరయ్యాడు.

సభ చాలా పెద్దది. ఎంతోమంది వచ్చారు సభకి. పది పదిహేను "లౌడ్‌స్పీకర్లు" ద్వారా నాయకుడి ఉపన్యాసం, ప్రజల చెవుల్లో గింగురు పెడుతూంది. పల్లెల్ని బాగుచెయ్యాలని—ఆ ఉపన్యాసంలోని సారాంశం. రామారావు పెదవి విరిచాడు. ఎన్నడూ పల్లెలు బాగుపడవనుకున్నాడు. పట్నంలోనుండి పెద్దలు, చదువుకున్న వాళ్ళు-డబ్బున్న వాళ్లువచ్చి, పల్లెల్ని బాగుచెయ్యడం జరగని పని. తను చదువుకున్నప్పుడుకూడా యిలాగే అనుకున్నాడు. కాని, పల్లెలో వుద్యోగంలో చేరగానే పల్లీయుల్లో తానోపల్లీయుడుగా తయారయ్యాడు. తనకన్న వాళ్ళే-ఆ పల్లీయులే- నయమనిపించింది.

స్నేహితులతోచెప్పి తను ఇల్లుచేరుకున్నాడు. తను యువకుడు. పాతిక సంవత్సరాలకి లోపు. యింకా మనిషి పెరుగుతూనేవున్నాడు. చాలా బలవంతుడుగా తయారయ్యాడు. మెలిదిరిగిన కండలు, విశాలమైన ఛాతీ, తనో "వస్తాదు"అనిపించుకున్నట్టుగా వినికిడి. మూడుపూటలా సుష్టుగా భోజనం. రెండుపూటలు పెరుగుతోనూ, ఒకపూట - రాత్రి - పాలుతోనూ ఇంకా

మధ్యమధ్య ఉపాహారాలు. ఎడతెరిపిలేని నిద్ర. పడుకున్నప్పుడు ఎవరులేపినా—వారికిఆయుర్దాయం నిండిందన్నమాటే.

సతీమణి రాకతో రాత్రివేళ కొంతవరకూనిద్ర ఆపుకోవలసివచ్చింది. అయినా, ఒక్కొక్కప్పుడు ఆవిడని చూచేవాడేకాడు. అంత బద్ధకస్తుడయి పోయాడు. తను పట్నంవెళ్ళి సినిమాలో కూచున్నంతసేపూ, అక్కడ కూచున్నట్లుమాత్రం తనకి తెలుసు, అంతే. తరవాత, ప్రక్కన కూచున్న రామినాయుడో, వెంకయ్యనాయుడో లేపితే, బయటపడేవాడు. వాళ్ళు దారిపొడుగునా ఆ సినిమాకథ చెపితే విని, ఊళ్ళోకిరాగానే ప్రగల్భాలు కొట్టేవాడు. తను యెంతగానో చదువుకున్న వాడికి మల్లే ప్రవర్తించేవాడు గ్రామంలో. చదివింది స్కూలుఫైనలు మాత్రమే.

అయితే ఆనాటి ఉపన్యాసం, స్నేహితుల బోధనలు రామారావులోఆలోచనలు రేగించాయి. అతని మనస్సు దారిపొడుగునా పనిచేసింది.

తను యింతకాలంనుండీ పల్లెలోచేస్తున్న పనేమిటి? ఏంలేదు. "ఉద్యోగం"అనబడే చిన్నపని. ఎంతకాలం వుంటుంది, దినంలో, ఆ పని? నాలుగ్గంటలు. మిగతాకాలంలో తను ఏమిచేస్తున్నట్లు? భోజనం, తిరగడం, నిద్ర, అంతేనా?—అంతే. కనీసం పుస్తకాలన్నా చదువుతున్నాడా తను? అబ్బే అదీలేదు. పుస్తకాలు రాసిన వాళ్ళందరూ ఏదో చూచి రాసినవాళ్ళే: అంచేత తను చూచిన వాటినిగూర్చిచదవటం అనవసరం. అయితేఇప్పటికి తను చూచినదేమిటి? ఏమీ లేదు. అందుకే తను నలుగురిలోనూ అవమానపడవలసి వచ్చింది. స్నేహితులంతా గేళిచేశారు.

ఎలాగైనా తను ఆ గ్రామంలో యేదేనా వుద్యమం లేవదీసి, తన స్నేహితులమాదిరిగానే, తనూ పేరు సంపాదించాలి. కొన్ని పుస్తకాలు చదివి,విజ్ఞానంసంపాదించాలి. ప్రపంచవిషయాలు తెలుసుకోవాలి. తను సంపాదించినజ్ఞానాన్ని ప్రజలలో వెదజల్లాలి. అలా చేస్తేగాని తనకి నిద్రపట్టదు. అందులో తను కృతకృత్యుడై, ఫలానా రామారావు గ్రామ సేవకుడు అనే పేరు నలుగురూ చెప్పుకుంటూంటే వినాలి. రేపటినుండే తను ఉద్యమంలో అడుగుపెట్టాలి తప్పదు. తన బద్ధకాన్ని ఒక్కసారిగా ఒదలకొట్టుకోవాలి. ఇందుకు యేమాత్రం వెనుకాడినా లాభంలేదు. ఆయింతా అయింతర్వాత ఓమాటు తన స్నేహితుల్ని పిలిచి పెద్ద బహిరంగసభ జరిపి తన గొప్పతనాన్ని వెల్లడించుకోవాలి. తను ఒట్టి దద్దమ్మకాదనీ కాస్త సరుకున్నమనిషేననీ నిరూపించుకోవాలి...

ఇలా ఆలోచనల్లో పడిపోయాడు. గడియారం పన్నెండు కొట్టినట్టు వినబడింది. అరె! తను పక్కమీది కొచ్చేసరికి తొమ్మిది గంటలే ఐంది. గడియారం తప్పు తిరుగుతూందా? అని దగ్గరగా వెళ్లి చూచాడు. కనబడలేదు అంకెలు. కాని టిక్కు టక్కు మనే శబ్దంమాత్రం వినబడుతూంది. అయినా లీలగా రెండుముళ్ళూ ఒక్కదగ్గరే పన్నెండుమీద వున్నట్లు గుర్తించాడు. "అమ్మయ్య!"—అనుకుని ప్రక్కమీద కూచున్నాడు. ఒక్కసారిఆవులించాడు. తన యీపాతికేళ్ళ జీవితంలోనూ అంతకాలంయెప్పుడూ బుర్రకి పని కల్పించలేదు—

"ఏయ్ - సరోజా..." అంటూ లేపాడు భార్యని.

"అబ్బ! పడుకుందురూ తెల్లవారుతూంది" అని మళ్ళా గురకపెడుతూంది.

తెల్లారడ మెక్కడే పన్నెండయితేను—"

"అలాగా-మామూలుగా తెల్లారుజామున లేపుతున్నారనుకున్నా ఇంత సేపూ యేంచేస్తున్నారు?"

"ఆలోచనల్లో పడ్డానే..."

దగ్గిరగా లాక్కున్నాడు—

* * *

తెల్లారింది. ఎనిమిదిగంట లయింది. ఆదివారం అని జ్ఞాపకాని కొచ్చింది. వెంటనే రాత్రి ఆలోచనలు మళ్ళీ వరుసగా బుర్రలో పరుగెత్తాయి.

అయితే తను యేమిచెయ్యడం? ఎవరితో మాటాడ్డం? దేనిగూర్చి మాటాడ్డం? మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ఒక్కసారి నిన్నటి సభా విషయాలు కళ్ళముందు మెదిలేయి. సభ పార్కులో జరిగింది. పార్కునిండా పూలమొక్కలు చూడ్డానికి ఎంతో అందంగావున్నాయి. క్రిందను పచ్చగడ్డి దట్టంగా పెరిగింది. కూచోడానికి మెత్తగా వుంది. మధ్యమధ్య ఎలక్ట్రిక్ దీపాలు ఎంతో కాంతిగా వున్నాయి. పార్కుకు మధ్యగా ఒక సిమెంటు ప్లాటుఫారం ఉపన్యాసాలకి ఎంతో

బాగుంది. అంచేత, తన గ్రామంలో యేదన్నా మీటింగు జరపాలంటే అటువంటి స్థలం కావాలి. అటువంటి పార్కు తయారు చెయ్యాలి. కనక ముందు ఆపనికి పూనుకోవాలి.

ఆ తరవాత?

పార్కుకి ప్రక్కగా పెద్ద రీడింగురూము చూశాడు. విశాలమైనహాలు. హాలునిండా ఎన్నో టేబిళ్ళూ వానిముందు కుర్చీలూ టేబిళ్ళమీద అనేకరకములైన పత్రికలు చుట్టూ లోపల అద్దపు బీరువాలు, బీరువాలనిండా అనేకమైన భాషల్లో వున్న పెద్దపెద్ద పుస్తకాలు రీడింగురూముకి ముందు మళ్ళీ ఓ చిన్న పార్కు అందులో మధ్యగా "ఫౌంటెన్" అలాగా తన గ్రామంలో కూడా ఒక రీడింగురూమూ, దానిముందు చిన్న పార్కూ, అందులో ఒక "ఫౌంటెన్" ఉండాలి.

ఇలాటి ఆలోచనలన్నీ బుర్రకి వేడెక్కించాయి. తిన్నగా మునసబుగారి దగ్గరకీ, కరణంగారి దగ్గరకీ వెళ్లి తన బుర్రలో ఇమిడియున్న విషయాలన్నింటినీ ఏకరువుపెట్టాడు రామారావు. విన్నారు శ్రద్ధగా యిద్దరూను. "సరే చూదాం" అన్నారు.

అలాంటి జవాబును ఆశించలే దతను. తక్షణమే ఆ పనికి వాళ్లిద్దరూ ఉపక్రమిస్తారనుకున్నాడు. దించిన తల యెత్తకుండా గుమ్మం దిగేడు. పోనీ, "వూరి పెద్ద" అనిపించుకున్న పోతయ్యదగ్గర కెళితే తన పంతం నెగ్గుతుందేమో నని, అతని ముందు కూచున్నాడు.

వడ్డీ వ్యాపారంలో ఆరితేరినవాడు పోతయ్య. కులానికి షావుకారు కాకపోయినా, వాళ్ళని మించిన వ్యాపారస్థుడు కూడాను. రామారావు ఏకరువు పెట్టినదంతా విని, దీర్ఘంగా అయిదు నిముషా లాలోచించి "అయితే నువ్వు ఏటంటావయ్యా?" అన్నాడు.

"నేను చెప్పినట్లూ చెయ్యమంటాను" అన్నాడు.

"పార్కంటే యేందయ్యా? మా పొలంలో కూడా గడ్డి బాగా పెరుగుద్దే! మరిక్కడ ఎందుకయ్యా? పశువులకి మేతకి తప్పిస్తే ఎందు కుపయోగ పడద్దయ్యా? పువ్వుల మొక్కలు మా దొడ్లో లేవుటయ్యా? అందరి దొడ్లల్లోనూ వున్నయ్యి కదయ్యా?" అన్నాడు.

రామారావు యీసారి బాగా దెబ్బతిన్నాడు. పది పదిహేను దినాలు గడిచినయ్. తన మాటను ఆ గ్రామంలో యెవరూ వినలేదు. సాయంత్రం ఊరి బయటనున్న చెరువుగట్టుకి చేరుకున్నాడు. క్రింపని ఒక బండరాయి వుంటే, చెట్టుకి చేరబడి దానిమీద కూచున్నాడు. అక్కడ కూచుంటే పల్లె బాగా కినబడుతుంది.

తనకి అక్కడనుండి కనబడుతున్నది పల్లె కాదు. పందుల వాకల సమూహం! ఆ పల్లెలో వున్న వాళ్ళు మనుషులు కారు—పందులు! కనుకనే తన మాట ఎవరూ వినలేదు. వింటే యెంత హాయిగా వుండును! ఆ పార్కు ఎంత రమణీయంగా వుండును! ఎంతోనుండి కూచుని ఆనందించ వచ్చును!

తను మాటాడుతూ వుంటే తనదగ్గరగా వచ్చి పోలిగాడు చుట్టపొగ వదలడమా? అందుకే, తను ఆ గ్రామంలో వున్నా డన్న మాటేగాని ఒకసారి గ్రామంలోకి వెళ్లేవాడుకాదు. ఇలాగ నేతనకి అవమానం జరుగుతుందని వూహించే, గుమ్మం దిగడం మానుకున్నాడు. తన ఉద్యోగంకూడా అక్కడేవుండి చెయ్యవచ్చును. తను గుమ్మం దిగవలసినపనిలేదు.

చనిపోయినతండ్రి ఉత్తనే చెప్పాడా—"నాయనా! ఒకరి గుమ్మంలోకిమనం వెళ్ళవద్దు. మన గుమ్మంలోకి ఒకరు వచ్చేటట్లుండాలి" అని. ఎంతో అనుభవంమీద చెప్పినమాటది.

ఛా ఛా. మరి ఆవూరిగూర్చి తలచగూడదు. వూరిని బాగుచేస్తే తన కేమొస్తుంది? ఎవడూ నాలుగురాళ్లు యివ్వడు.

స్నేహితులు అడిగితేనా? "ఓయి దద్దమ్మలూ మావూరు వచ్చిచూడండి. ఎంతగానో ప్రయాసపడ్డాను. గాని లాభంలేకపోయింది. వెధవలు బయితులుగాకపోతే, పార్కు వాళ్ళ కేంతెల్సు? ఏనాడన్నా చూశారా?" అని చెప్పెయ్యొచ్చు.

చరచరా యింటివేపు నడిచాడు. యిక తను సంస్కరణగూర్చి తలపెట్టగూడదని నిశ్చయించుకున్నాడు.